క్లుప్తంగా

త్వరలో ఇంటింటికీ తాగునీరు సరఫరా



సిమెంట్ నగర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: జిల్లా కేంద్రమైన నంద్యాలలో శుక్రవారం అభివృద్ధి పనులు ప్రారంభించి బేతంచెర్లకు వస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో కొద్దిసేపు గ్రామస్తులతో ముచ్చటించారు. ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. త్వరలో గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గనను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బండి కుమార్, మహేష్, ఓం శివ, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు ఘనంగా సత్కరించారు.

డోన్ రైల్వే స్టేషన్ తనిఖీ



స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం

డోన్ రూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను శుక్రవారం రైల్వే ఎస్‌డీజీఎం అరవింద్‌మల్కేదే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో సమస్యలపై సంబంధిత ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్‌లో వసతుల పరిశీలించారు. రెస్ట్ రూం, అతిథి భవనాన్ని పరిశీలించారు. రైల్వే ప్రయాణికులకు అన్నివసుతలను ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కాటసాని జయమ్మకు అయోధ్య అక్షింతలు అందజేత



అయోధ్య అంక్షింతలు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మకు శుక్రవారం అయోధ్య రామాలయ విజయోత్సవ అంక్షింతలను సమరసత సేవా జిల్లా కన్వీనర్, న్యాయవాది మాధవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్య శ్రీరామ మందిరంలోని శ్రీబాలరాముడు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కుల మతాలకు అతీతంగా పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో మండల సమరసత సేవా కన్వీనర్లు మల్లారెడ్డి, శంకరయ్య, విశ్వహిందూపరిషత్ అధ్యక్షులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, గౌండ సుబ్బయ్య,విశ్వనాథ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగముని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం క్షేమం, సురక్షితం అని డిపో మేనేజర్ శోభాషణ్ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం లక్కీ డిప్ తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 1వ తేది నుంచి 15వ తేది వరకు ప్రయాణించిన వారి టిక్కెట్లను లాటరీ తీశారు. పట్టణంలోని పాతపేటకు చెందిన శ్రీదేవి, వెంకటేశ్వర్లు మొదటి, రెండవ బహుమతులు, కర్నూల్‌కు చెందిన హనుమంతు మూడవ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాజర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



అన్నవరంలో రైతులకు డ్రోన్‌పై అవగాహన దృశ్యం

అవుకు: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అబ్దుల్ హక్ అన్నారు. మండల పరిధిలోని అన్నవరం, వేములపాడు గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, హౌసింగ్ ఏఈ క్రిష్టారెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్, సర్పంచ్ మాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరుగులు

రూ.3కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఐటీఐ వసతి గృహం ముస్తాబు

- నేడు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- తుదిదశకు చేరిన క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌ఫూల్ పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మున్సిపల్ పార్క్



డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మోడల్ నియోజకర్గంగా డోన్ అభివృద్ధి చెందుతుంది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ప్రత్యేకించి డోన్ పట్టణం సుందరంగా ముస్తాబవుతోంది. ఇప్పటికే విశాలమైన రహదారులు, నూతన ప్రభుత్వ భవనాలతో కళకళలాడుతోంది. ఈ మేరకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో 300 మంది విద్యార్థులకు సరిపడే నూతన వసతిగృహ సముదాయం ముస్తాబు అయ్యింది. ఈ నెల 19న (నేడు) మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వతసతి గృహాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ వసతిగృహాన్ని అత్యాధునికంగా నిర్మించారు. ఈ ఏడాది ఈ భవనంలో కేంద్రీయ విద్యాలయ తరగతులు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది స్థానిక పేరంటాలమ్మ గుడి వద్ద నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ నూతన భవనంలోకి తరగతులను మార్పించి ఇక్కడ తిరిగి ఐటీఐ విద్యార్థులకు వసతి కల్పించేందుకు భవనాలను వినియోగిస్తారు. ఐటీఐ విద్యార్థుల కష్టాలు తీరనున్నాయి. దీంతో విద్యార్థులతోపాటు పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లబ్ హౌస్ ముస్తాబు

రూ.2కోట్లతో స్థానిక రైల్వేస్టేషన్ రహదారి ప్రక్కన నిర్మించిన క్లబ్‌హౌస్ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. వీటితో పాటు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్‌లను కూడా మంత్రి బుగ్గన త్వరలో ప్రారంభించనున్నారు.

రూ.1.90కోట్లతో స్విమ్మింగ్ ఫూల్

స్థానిక డాక్టర్ రామసుబ్బయ్య పార్కులో రూ.1.90కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న స్విమ్మింగ్ ఫూల్స్ కూడా ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నాయి. మహిళలకు సైతం ప్రత్యేకంగా స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు చేశారు. ఈ పార్కు ఆవరణలో రూ.30లక్షలతో పిల్లలకు వివిధ ఆట వస్తువులు, పరికరాలు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ ఫూల్ పోటీల సందర్భంగా వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీ, క్యాంటీన్, మరుగుదొడ్లు, డయాస్‌ను కూడా నిర్మిస్తున్నట్లు కాంట్రాక్టర్ సాధిక్ తెలిపారు. వీటిని కూడా త్వరలోనే మంత్రి ప్రారంభిస్తారన్నారు.



రూ.3కోట్లతో నిర్మించిన ఐటీఐ విద్యార్థుల వసతి గృహం



రూ.2కోట్లతో నిర్మించిన క్లబ్‌హౌస్ నూతన భవనాలు



డాక్టర్ రామసుబ్బయ్య పార్కులో ముస్తాబవుతున్న పురుషుల స్విమ్మింగ్ ఫూల్



మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ ఫూల్



ముస్తాబైన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పార్కు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లె : పట్టణంలోని సచివాలయం-2 పరిధిలోని పంచమపేట, బీసీ కాలనీల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్, వార్డు సభ్యులు బూత్ కమిటీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంజామల: మండల కేంద్రం సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల సంబధించిన గ్రామాలలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలు అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బేతంచెర్ల:విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు బేతంచెర్ల పట్టణంతో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూదన్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో సింగిల్ ఫేస్ సరఫరా ఉంటుందని, ప్రజలు గమనించాలని సూచించారు.

బనగానపల్లె రూరల్: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. పాతపాడు, పసుప ల, బనగానపల్లె పట్టణాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకే ఆటల పోటీలు



హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

బేతంచెర్ల: గ్రామీణ క్రీడా కారుల ప్రతిభ గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కోకో పోటీల్లో యంబాయి జట్టు విన్నర్‌గా నిలిచింది. క్రికెట్‌లో సీతారామాపురం- హెచ్ కొట్టాల జట్లు తలపడ్డాయి. సీతారామాపురం జట్టు ఫైనల్‌కు చేరింది. అదేవిధంగా కబడ్డీ పోటీల్లో ఎం,పేండేకల్లు పై ఆర్ ఎస్ రంగాపురం గెలుపొంది ఫైనల్ చేరింది. వాలీబాల్ పోటీల్లో యంబాయి పైన ముద్దవరం జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. శనివారం ఫైనల్ ఆటల పోటీలు నిర్వహిస్తామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వెంకట్ నాయక్ తెలిపారు. ఫైనల్ కు చేరుకున్న జట్లను ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అభినందించారు.

క్రికెట్ విజేత గిద్దలూరు జట్టు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వ్యాయయ ఉపాధ్యాయులు మౌలాలి, బాషా పర్యవేక్షణలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. క్రికెట్ ఫైనల్ మ్యాచ్ పేరుసోముల, గిద్దలూరు మధ్య ఉత్కంఠంగా సాగింది. హోరాహోరిగా సాగిన ఈ మ్యాచ్‌లో పేరుసోముల జట్టు విజయం సాధించింది. క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు. ఓర్వకల్లు మండలం నన్నూర్ గ్రామానికి చెందిన తెలుగు వెంకట్రాముడు (58) ఇరవైఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం బేతంచెర్లకు వచ్చి ఉప్పునీళ్ల బావి సమీపంలోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 11న ఇంటి మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పట్టణంలో కులగణన ప్రారంభం



తారకరామనగర్‌లో కుల గణన చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన కార్యక్రమం శుక్రవారం పట్టణంలో ప్రారంభమైంది. మున్సిపాలిటీ పరిధిలోని 16 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మర్కజ్ మసీద్ ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కొండపేటలో మర్కజ్ మసీద్ వద్ద తబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామ పంచాయతీ నిధులతో మర్కజ్‌మసీద్‌కు ఏర్పాటు చేసిన ప్రహరిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ముస్లిం ల ఆత్మీయ సమావేశంలో కాటసాని మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, ముస్లిం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తున్నారన్నారు. నాడు దివంగత వైఎస్సార్ ముస్లింల కోసం 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, నేడు సీఎం వైఎస్ జగన్ ముస్లిం మైనార్టీల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలతో పాటు ముస్లిల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తున్నామన్నారు. పట్టణంలో రూ.70 లక్షలతో ముస్లిం శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశామని, రూ.2.40 కోట్లు బనగానపల్లె కోవెలకుంట్ల పట్టణాల్లో ముస్లింల కోరకు షాధిఖానా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొండపేటలో షియా మతస్తులకు రూ.40లక్షలతో ఇబాదాత్‌ఖానా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ రూ.30లక్షలతో ఈద్గాకు ప్రహరీ నిర్మించామన్నారు. అవుకు మెట్ట వద్ద ముస్లింలకు మరో శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం చేపడుతామన్నారు. ఇంకా ముస్లింల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేయాల్సి ఉందని, వాటిని కూడ దశలవారీగా చేపట్టడడం జరుగుతుందన్నారు. సీఎం జగనన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేశారని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ ఖాలీల్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి అత్తార్‌జాహెద్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు తహీర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ ముఖ్య నాయకులు పెద్దన్న, సునార్ ఇక్బాల్, మాలి, హసన్, గౌండబాషా, వలి, ఖాజాపీర్, తబ్లిక్‌జమాత్ అమీర్ మహమ్మద్ ఖాసీం, మసిద్ కమిటీ అధ్యక్షుడు జావేద్‌బిన్ అబ్దుల్లా, షాక్‌మాం, జావేద్ హుస్సేన్ తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

24 నుంచి వైఎస్సార్ ఆసరా సభలు

బనగానపల్లె : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు మండలాల వారీగా వైఎస్సార్ ఆసరా సభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 24న ఉదయం కోవెలకుంట్ల వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో సభ నిర్వహస్తున్నామన్నారు. అదేవిధంగా 25న సంజామల ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం, 26న అవుకు ఉన్నత పాఠశాల మైదనంలో 27న కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల మైదానం లో, 28న బనగానపల్లె ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని జయమ్మ, కాటసాని మేధాశ్రీరెడ్డి, చల్లాకుటుంబ సభ్యులు హాజరవుతారన్నారు. ఆయా మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బూత్ కమిటీ కన్వీనర్లు, వలంటీర్లు గృహసారథులు, పొదుపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఆరోగ్య సురక్ష .. పేదలకు వరం

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ విద్యా సాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సొదరదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అమడాల, గుంజలపాడు, సొదరదిన్నె గ్రామాలకు చెందిన 516 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. రేవనూరు, నంద్యాల ఉదయానంద ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు మహబూబ్ సుభాని, హరికృష్ణ, సుప్రియ, కంటివైద్య నిపుణుడు గంగాధర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ సయ్యదు స్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, ఈఓపీఆర్డీ రాధిక పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తుందని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్వర్, వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు వాణిశ్రీ, చెన్నకేశవులు, నరేశ్, రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేంద్రగౌడు, మనోహర్ రెడ్డి, గంగాదేవి, పంచాయతీ కార్యదర్శి భూషన్, సచివాలయం సిబ్బంది కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మీరాపురంలో ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిరం నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను వార్డు సభ్యులు బత్తుల రామ్మోహన్ రెడ్డితో కలిసి తోటబుచ్చిరెడ్డి ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, డాక్టర్లు జగదీశ్వరరెడ్డి, రాజేష్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

అవుకు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు అన్నారు. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను పరిశీలించిన తహసీల్దార్ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. 402 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఆకుమళ్ల పీహెచ్‌సీ డాక్టర్ జయభారత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, డాక్టర్లు అజయ్ కుమార్, సురేష్, సర్పంచ్ కర్నాలు లచ్చమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి అన్నారు. శుక్రవారం చింతలాయిపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భార్గవీలత, డాక్టర్లు, వినోద్‌కుమార్, కల్యాణ్, జయరాం, సతీష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జయరామకృష్ణుడు,సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న మహిళలు



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వాణిశ్రీ



హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్ బాబు



మందులు పంపిణీ చేస్తున్న అంబటి గుర్విరెడ్డి

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన అనాథ వృద్ధుడి మృత దేహానికి శుక్రవారం బనగానపల్లె ఐఎంఎం ఆర్గనైజేషన్ సభ్యులు ముస్లిం సంప్రదాయ ప్రకారం అంత్యక్రియాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఎం నాయకులు కటిక కరీముల్లా, అత్తార్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, మరిది వేధింపులకు పాల్పడుతున్నారని పట్టణానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సజ్జద్ అలి తెలిపారు. భార్గవిని కడప పట్టణానికి చెందిన నవీన్‌తో 2022 మే6న వివాహం చేశారు. కొంత కాలంగా భర్త నవీన్, అత్త ఇంద్రావతి, మామ రామకృష్ణ, మరిది కిశోర్ కుమార్ అదనపు కట్నంతో పాటు మోటర్ సైకిల్ కొనివ్వాలని వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

బనగానపల్లె రూరల్: జాతీయ పార్టీ బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బనగానపల్లె నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బీవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తెలుగుదేశం పార్టీకి అధికారం ఇచ్చారని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని గుర్తు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

డోన్ టౌన్ : పాతపేటలోని రాములదేవాలయంలో శుక్రవారం వాల్మీకి సంఘం నాయకులు 2024 సంవత్సరంకు క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులనాయుడు, డోన్ మండల వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎస్ఆర్ఐ కత్తార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు బుర్రు రమాదేవి, మేకల విమల, ఆర్ట్ రమణ, వెంకటనాయునిపల్లె, సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

బేతంచెర్ల: అత్యవసర వేళల్లో ప్రథమ చికిత్సలో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందజేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ(ఆర్ఎంపీ) సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడేశ్వరి మాత ఆలయం ఆవరణలో జిల్లా కోశాధికారి నాగసురేంద్ర ఆధ్వర్యంలోగ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 4న విజయవాడలో జరిగే మహాసభ పోస్టర్లను విడుదల చేశారు.